సాక్షి
వికారాబాద్
సోమవారం । 22 । జూలై । 2024



చదివిన బడిలో కొలువు

చదువుకున్న బడిలో ఉపాధ్యాయులుగా పని చేసే అవకాశం అందరికీ దక్కదు. అలాంటి అదృష్టం ఐదుగురికి వచ్చింది. 8లో▸



పశువులు భద్రం

వానాకాలంలో మూగజీవాలకు ముప్పు తప్పదు. ఈ సీజన్‌లో గొంతువాపు వంటి వ్యాధుల బారిన పడుతాయి. 8లో▸



ఘనంగా మైసమ్మ బోనాలు

పట్టణంలో మైసమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 9లో▸

నేడు కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

కొడంగల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : కొడంగల్
కమిషనర్ : బలరాం నాయక్
తేదీ : 22-7-2024 (సోమవారం)
సమయం : మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
74165 95493, 83099 57839

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100కు గాని, పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712670056లో గాని సంప్రదించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలపై జాగ్రత్త వహించాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయాలని చెప్పారు. పాడుబడిన బావులు, కంచెలేని బావుల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు దాటే అవకాశం లేని ఎడల పోలీస్ అధికారులకు గాని, ఇతర అధికారులకు గాని సమాచారం అందించాలన్నారు. వీలైతే ఇరువైపులా రహదారిపై కంచె వేసి తోటి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని సూచించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

అనంతగిరి: ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేర్చాలని ఆ సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం నగరంలోని స్పీకర్ నివాసంలో గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం మేనిఫెస్టో, కామారెడ్డి బీసీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన విధంగా ముదిరాజులను బీసీ-డి నుంచి ఎ గ్రూపులోకి మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, నర్సింలు, రాములు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు భర్తీ

కొడంగల్: నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో ప్రారంభించిన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు భర్తీ అయ్యాయని కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలోనే వివిధ గ్రూపుల్లో 187 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. 95.9 శాతం సీట్లు భర్తీ అవ్వగా కేవలం ఎనిమిది సీట్లు మాత్రమే ఖాళీ ఉన్నాయని చెప్పారు.

ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా రాంబల్ నాయక్

కేశంపేట: లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎక్లాస్‌ఖాన్ పేట గ్రామ పరిధిలోని పోడగుట్ట తండాకు చెందిన రాంబల్ నాయక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

టార్గెట్ @ 1.29 కోట్లు

చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళిక సిద్ధం

- రేపటి వరకు టెండర్లకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో మొత్తం చెరువులు 1,179
- చేపలు వదిలేందుకు గుర్తించినవి 746



దోమ: పెద్దచెరువులో చేప పిల్లలను వదులుతూ..

వికారాబాద్: వంద శాతం రాయితీతో అందజేయనున్న చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవలే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నిధులను విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న చెరువులు.. ఏయే చెరువుల్లో చేపపిల్లలు వదిలాలి.. అనే విషయాలను గుర్తించారు. ఇందుకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం టెండర్ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 15నుంచి 23వ తేదీ వరకు బిడ్లు వేసేందుకు గడువు విధించారు. ఆగస్టులో చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు, కుంటలు ఉండగా 746 చెరువుల్లో చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. ఈ ఏడాది 1.29 కోట్ల చేప పిల్లలు వదలాలని టార్గెట్ పెట్టుకున్నారు. జిల్లాలో 139 మత్స్య సహకార సంఘాలు ఉండగా వీటిలో 5,142 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరుతోంది. మరో వారంలో రోజుల్లోగా పూర్తి స్థాయి నీటి మట్టం చేరే అవకాశం ఉంది. ఆగస్టు మొదటి వారం నుంచే చేప పిల్లలు వదలాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి. చెరువులకు సరిపడా చేప పిల్లలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

60 నుంచి 70 శాతం వరకే..

చేప పిల్లల విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి చెరువుల్లో వదులుతున్న దానికి ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ఏటా ఇదే తంతు జరుగుతోంది. ఎంచుకున్న లక్ష్యంలో 60 నుంచి 70 శాతం వరకే చేప పిల్లలు వదిలి మమ అనిపిస్తున్నారు. గతేడాది కూడా ఇదే జరిగింది. ఈ సారైనా చెరువుల్లో సరిపడా చేప పిల్లలు వదలాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి. జిల్లాలోని 746 చెరువుల్లో 1.29 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ టార్గెట్‌ను కచ్చితంగా పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండేవి. గతేడాది జూలైలోనే పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. సకాలంలో చేప విత్తనం పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకోవాల్సి వచ్చింది.

నాసిరకం చేప పిల్లలతో నష్టం

అధికారులు నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ శాతం నాసిరకంగా ఉంటున్నాయని తెలిపారు. సాధారణంగా పిల్లలను చెరువుల్లో వదిలే సమయంలో మూడు నుంచి నాలుగు ఇంచులు ఉండాలి. కానీ ఒక్క ఇంచుకు మించి ఉండటం లేదు. గతేడాది అధికారులు దోమ మండలం మోత్కూర్ చెరువులో వదిలేందుకు చేప పిల్లలు తెచ్చారు. అవి ఒక్క ఇంచు ఉండటంతో గొడవకు దిగారు. ఇవి వద్దంటూ వెనక్కు పంపారు. ఇలా నాలుగుసార్లు జరిగింది. నాసిరకం చేప పిల్లలను చెరువుల్లో వదిలితే వాటి ఎదుగుదల ఉండదని మత్స్యకారులు వాపోతున్నారు. చాలా చిన్న పిల్లలు కావడంతో లెక్కల్లో కూడా తేడా వస్తోందని చెప్పారు. లక్ష పిల్లల వదిలామని అధికారులు చెబుతున్నా 50 వేలు కూడా ఉండటం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ సారైనా అధికారులు నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



ప్రసాదం కోసం గొడుగులను తిప్పిపట్టుకున్న భక్తులు

చిన్న జాతరలో పెద్ద ఘట్టం

- వర్షంలోనే 'పెరుగు బసంతం'
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- గరుడ వాహనంపై ఊరేగిన అనంత పద్మనాభ స్వామి



గరుడ వాహనంపై ఊరేగుతున్న అనంత పద్మనాభ స్వామి

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ఆషాఢ మాస చిన్నజాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పెరుగు బసంతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడవాహనంపై పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి పెరుగు బసంతం కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక మహాప్రసాదాన్ని తయారు చేశారు. అనంతరం ప్రసాదాన్ని ఉట్టిలో తీసుకువచ్చి ఉత్సవ స్తంభంపై ఉంచారు. ప్రత్యేక పూజల తర్వాత ఉట్టిని పగులగొట్టి భక్తులకు మహా ప్రసాదం చల్లారు. ఈ ప్రసాదాన్ని రైతుల పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని.. ఇంట్లో ఉంచితే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మిక. భక్తులు ప్రసాదం దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. వర్షానికి తీసుకెళ్లిన గొడుగులను తిప్పి పట్టుకుని ప్రసాదం కోసం ఆరాటపడ్డారు. ఉత్సవాలకు జిల్లా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్, బీదర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి నుంచి భారీగా తరలివచ్చారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు పట్టణ సీఐ నాగరాజు, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీకాంత్ రెడ్డి, బుచ్చిబాబుగౌడ్, ఆలయ ఈఓ నరేందర్, ఫౌండర్ ట్రస్టీ పద్మనాభం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

ఇబ్రహీంపట్నం: సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, పాకెట్ మనీ పెంచాలని.. మెనూ సక్రమంగా అమలుపర్చాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. ఎస్‌ఎంహెచ్ హాస్టల్ అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం కెనరాబ్యాంకు కింద ఉన్న కళాశాల స్థాయి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెస్‌చార్జీలు రూ.1,500 నుంచి రూ.2,500కు, పాకెట్ మనీ రూ.1000 ఇవ్వాలని అన్నారు. 160 మంది విద్యార్థులుంటున్న ఈ హాస్టల్‌లో 24 గదులు మాత్రమే ఉన్నాయని.. ఒక్కో గదిలో ఆరుగురు చొప్పున ఉండడంతో ఇరుగ్గా మారిందన్నారు. అవసరానికి సరిపడా నీళ్లు రావడం లేదన్నారు. పోటీ పరీక్షల మెటీరియల్‌ను లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని, ఆట వస్తువులు అందించాలన్నారు. ఉదయం వేళ టిఫిన్ పెట్టకుండా పప్పుతో కూడిన రైస్‌ను పెడుతున్నారని, 15 నెలల నుంచి హాస్టల్ భవనానికి అద్దె, 5 నెలల నుంచి కరెంట్ బిల్లు చెల్లించడంలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు భవనాన్ని నిర్మించాలని, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులు మూడు నెలలకోసారైన హాస్టల్‌ను తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాలని, నెలకోసారి వైద్యాధికారులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్, కార్యదర్శి ప్రకాష్‌కారత్, మండల కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు సన్నిధిలో ఆర్మీ మేజర్ జనరల్



మొయినాబాద్: బైసన్ డివిజన్ ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్ ఝా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. రంగరాజన్ స్వామి వారి పూలమాలతో వారికి ఆశీర్వాదం అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు.

ముసురేసింది

జిల్లాలో రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షం



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

- మోమిన్‌పేటలో అత్యధికం
- బొంరాస్‌పేటలో అత్యల్పం

వికారాబాద్: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షంతో పంటలకు జీవం పోసినట్టయింది. భారీ వర్షాలు కురవకున్నా రోజంతా వర్షంతో రైతుకు కాస్త ఉపశమనం లభించింది. ఇప్పటికే అడుగంటిన చెరువులు, కుంటలకు వాగుల నుంచి స్వల్పంగా నీరు చేరుతోంది. గడిచిన 24 గంటల్లో మోమిన్‌పేటలో గరిష్టంగా 26 మిల్లీ మీటర్లు అత్యల్పంగా బొంరాస్‌పేటలో 8.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది.

చెరువులకు చేరని నీరు

ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో ఎక్కువ మండలాల్లో లోటు వర్షపాతం ఉండగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అధిక వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ఆరంభం మొదలు ఇప్పటి వరకు జిల్లాలో మూడు మండలాలు మినహా అన్ని మండల్లాలో అధిక వర్షపాతం రికార్డయింది. జిల్లాలో 20 రెవెన్యూ మండలాలుండగా వికారాబాద్, పరిగి, పూడూరు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదవ్వగా మిగిలిన 17 మండలాల్లో అధిక వర్షాలు కురిశాయి. జూన్ 1నుంచి ఇప్పటి వరకు జిల్లాలో సగటు వర్షపాతం 226.1 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 342.5 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదైంది. భారీ వర్షాలు లేక చెరువుల్లోకి సంవృద్ధిగా నీరు చేరడం లేదు.

ఆనందంలో అన్నదాత

వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు పంటలకు సరిపడా వర్షం కురవలేదు. అప్పుడప్పుడు కురిసిన వర్షం సైతం ఓ ప్రాంతంలో కురిసి కొన్ని ప్రాంతాల్లో కురవలేదు. దీంతో చెలకలు, ఇసుక పొలాల్లో మొక్కజొన్న తదితర సగం మొలకెత్తాయి. వెంటవెంటనే వర్షాలు కురవకపోవటంతో కొన్ని చోట్ల పంటలు పాడయ్యాయి. ఇప్పటికే వరినాట్లు వేసుకునే సీజన్ ప్రారంభం కావటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ వర్షాలతో బోరు బావుల్లో, చెరువుల్లో మరింత నీరు పెరిగి నాట్లు ఊపందుకోనున్నాయి.

అప్రమత్తంగా యంత్రాంగం

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గత అనుభవాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. వరదల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా కింది స్థాయి యంత్రాంగం వరకు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వాగులు, బ్రిడ్జీలతో పాటు పలు ప్రాంతాలను ప్రమాద స్థలాలుగా గుర్తించారు. అన్ని చోట్ల రెవెన్యూ, పోలీసులు నిఘా ఉంచాలని కింది స్థాయి యంత్రాంగానికి సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మున్సిపాలిటీల్లో రోడ్లన్నీ బురదమయంగా మారాయి.

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	నమోదైన వర్షపాతం (మి.మీలో)
మర్పల్లి	15.2
మోమిన్‌పేట్	26
నవాబుపేట	17.5
వికారాబాద్	16.8
పూడూరు	14.4
పరిగి	16.1
కుల్కచర్ల	21.6
దోమ	19.3
బొంరాస్‌పేట్	8.5
ధారూరు	15.1
కోట్‌పల్లి	19.3
బంట్వారం	14
పెద్దేముల్	15.3
తాండూరు	15.3
బషీరాబాద్	17.5
యాలాల	13.2
కొడంగల్	13.6
దౌల్తాబాద్	16.8
చౌడాపూర్	16.5
దుద్యాల్	10.3

వర్షాకాలం.. జర పైలం

- శిథిలావస్థకు చేరిన ఇళ్లు.. పాతగోడలతో ప్రమాదం
- కూల్చివేయించాలని కోరుతున్న గ్రామస్తులు



ఆలేడ్‌లో పాడుబడిన నివాసం

దుద్యాల్: అసలే వర్షాకాలం.. వరుసగా ముసురు పెట్టడంతో గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లు, పాడుబడిన పాతగోడలు తడిసి కూలే అవకాశం ఎక్కువ. దీంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని ఆయా గ్రామాల వాసులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు ముందస్తుగానే వీటిని గుర్తించి కూల్చి వేయాలని కోరుతున్నారు. ముసురు వర్షానికి దుద్యాలకు చెందిన ఆకారం రమేశ్ ఇళ్లు శనివారం కూలిన విషయం విదితమే. మండల పరిధిలోని ఆలేడ్, హస్నాబాద్, దుద్యాల్, లగచెర్ల, కుదురుమల్ల, హకీంపేట, ఈర్లపల్లి తదితర గ్రామాల్లో పాడుబడిన ఇళ్ల పాత గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చిందేదుకు ప్రత్యక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాములకు ఆవాసాలు

మండల పరిధిలోని గ్రామాల్లో పాత ఇళ్ల గోడల్లో పాములు, విషపూరిత జీవాలకు ఆవాసాలుగా మారాయి. పాడుబడిన ఇళ్ల నుంచి పాములు చుట్టు పక్కన ఇళ్లలో చేరుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఏవైనా జంతువులు మృత్యువాతపడితే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హస్నాబాద్‌లో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు

క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ ఎండీ రవూఫ్

బొంరాస్‌పేట: పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఆదివారం పోలీసులు బాధితుడికి అప్పగించారు. బషీరాబాద్‌కు చెందిన నార్యానాయక్.. ఇటీవల మండల పరిధి రేగడిమైలారంలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎండీ.రవూఫ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుకొన్నారు. అనంతరం నాయక్‌కు అప్పగించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

పరిగి: ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో సైబర్ నేరగాళ్ల కాల్స్ ఎక్కువయ్యాయని, రైతులు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ బ్యాంకుల లోగోలతో వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పంపి కొందరు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మెసేజ్‌లు వచ్చినా, కాల్స్ వచ్చినా స్పందించవద్దని సూచించారు. ఖాతాకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి తెలుసుకోవాలన్నారు. ఏమైనా లింకులు వచ్చినా వాటిని ఓపెన్ చేయరాదన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం



వ్యక్తి మృతదేహం

పూడూరు: గుర్తు తెలియని శవం చన్గోముల్ ఠాణా పరిధిలో ఆదివారం లభ్యమయింది. ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన రోడ్డు మీర్జాపూర్ గేటు సమీపంలో (30) సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం పడుంది. ఏదైనా వాహనం ఢీకొట్టడం వలన మృతి చెందాడా, మరేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. మృతుడి ఒంటిపై నల్లని ప్యాంటు, బ్లూ గ్రీన్ గీతల షర్టు ఉంది. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

5.5 కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: గంజాయి సరఫరా చేసేందుకు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన సంఘటన ఆదివారం జరిగింది. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బీమల్ నాయక్(26), ఉమేశ్ మాఝీ(28) ఇద్దరూ మేస్త్రీలు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్–భానూరు వద్ద పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి శంకర్‌పల్లి పట్టణానికి చెందిన అరుణ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అరుణ్.. ఒడిస్సాలో గంజాయి తక్కువ ధరకు లభిస్తుందని, సరఫరా చేస్తే.. పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తానని ఆ ఇద్దరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనుకున్నట్లుగా.. ఆ ఇద్దరు.. వారి స్వరాష్ట్రం నుంచి 5.5 కిలోల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తెచ్చారు. అనంతరం శంకర్‌పల్లిలో అరుణ్‌కు సరఫరా చేయడానికి వెళ్తుండగా.. పక్కా సమాచారంతో శంకర్‌పల్లి పోలీసులు బీడీఎల్ చౌరస్తాలో వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కిరాణా దుకాణం దగ్ధం

శంకర్‌పల్లి: ప్రమాదవశాత్తు కిరాణా దుకాణం దగ్ధమైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి అంతప్పగూడ గేటు వద్ద శేరిగూడ గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్ కొంత కాలంగా కిరాణా దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి షాపు మూసి వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం స్థానికుల సమాచారంతో దుకాణం వద్దకు రాగా.. షాపు కాలిపోయింది. షాట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. సుమారు లక్షన్నర వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

చదివిన బడిలో కొలువు

ఓనమాలు దిద్దిన చోటే.. విద్యాబోధన

- నాటి విద్యార్థులే.. నేటి టీచర్లు



కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

కొడంగల్ రూరల్: చదువుకున్న బడిలో ఉపాధ్యాయులుగా పని చేసే అవకాశం అందరికీ దక్కదు. అలాంటి ఇక్కడ ఆ అదృష్టం ఒక్కరికో ఇద్దరికో కాదు ఏకంగా ఐదుగురికి వచ్చింది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలలో 26మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, అందులో ఆరుగురు స్థానికులు కావడంతో పాటు.. అదే బడిలో ఆడుతూ పాడుతూ ఓనమాలు దిద్దిన వారే కావడం గమనార్హం. అలాంటి సరస్వతి నిలయంలో.. పిల్లలకు పాఠాలు చెప్పే భాగ్యం దక్కడాన్ని ఆ టీచర్లు అదృష్టంగా భావిస్తున్నారు. ఇలాంటి రోజు వస్తుందని ఎప్పుడూ ఊహించలేదని స్పష్టంచేసిన టీచర్లు.. 'సాక్షి'తో పంచుకున్న సంతోషం వారి మాటల్లోనే..

ఆనందంగా ఉంది



పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాను. నేను విద్యనభ్యసించిన సర్వస్వతి ఒడిలో గురువుగా పనిచేయడం ఆనందంగా ఉంది. విద్యార్థులతో మమేకమై పాఠాలు చెబుతున్నాను. వారిని ఉన్నతిగా తీర్చిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను.

– కేసీ వెంకటేశ్

ఊహించలేదు



చదువుకున్న బడిలో పనిచేయడం గొప్ప అనుభూతి. విద్యార్థి దశలో స్వయం పరిపాలనా దినోత్సవంలో ఒక్క రోజు టీచర్‌గా పనిచేసినప్పుడు.. జీవితంలో ఉపాధ్యాయుడిని అయి, ఇక్కడే పనిచేస్తానని ఊహించలేదు. తల్లిదండ్రుల తరువాతి స్థానంలో ఉన్న నేను.. విద్యార్థులతో స్నేహంగా ఉంటూ.. పాఠాలు బోధిస్తా.

– గోపీనాథ్

మా నాన్న ఇక్కడే



మా నాన్న ఇదే పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేశారు. ప్రస్తుతం నేను ఇదే బడిలో హిందీ బోధిస్తున్నాను. ఇది మరిచిపోలేని అనుభూతి. పుట్టిన ఊరిలోనే పనిచేసే అవకాశం దక్కడం చాలా సంతోషంగా ఉంది.

– చంద్రకళాబాయి

గుర్తుకొస్తున్నాయి



1985–86విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఇక్కడే పూర్తి చేశాను మా నాన్న టీచర్‌గా పనిచేశారు. నాకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరడమే కాకుండా.. పాఠాలు విన్నే చోటే.. పాఠాలు బోధించడం అదృష్టంగా భావిస్తున్నాను. నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. మండల పరిధి టేకుల్‌కోడ్ నుంచి జెడ్పీహెచ్‌ఎస్‌కు పదోన్నతిపై వచ్చాను.

– బి.కరుణాకర్

పుట్టిన ఊరిలో..



పుట్టిన ఊరు, చదువుకున్న బడిలో చదువు చెప్పే అదృష్టం రావడం గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. పాఠశాలలో పిల్లలకు పాఠాలు బోధిస్తుంటే నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. ఈ బడిలో చదువుకున్న వారెందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

– ఆనంద్‌రావు

మధురానుభూతి



మా నాన్న టీచర్‌గా పనిచేశారు. నేను ఇక్కడే చదివాను. ఇదే బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం సంతోషంగా ఉంది. నాటి గురువుల పట్ల ఉన్న గౌరవం, అభిమానాలు, విద్యాబోధన చేసే సమయంలో గుర్తుకొస్తుంటాయి. నా జీవితంలో ఇది మధురానుభూతి. మరువలేనిది.

– మురళీధర్

జ్ఞాన జ్యోతిని వెలిగించేది గురువే

- వారి రుణం తీర్చుకోలేనిది
- సనాతన ధర్మంలో గురువు దేవుడితో సమానం
- ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి



పూజోత్సవంలో మాట్లాడుతున్న విజయభారతి

పరిగి: 'గురువు లేనిదే జ్ఞానం లేదు. సనాతన ధర్మంలో వారిని దేవుడితో సమానంగా భావిస్తారు' అని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురుపూర్ణిమ మహోత్సవం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడారు. గురువు అనే పదానికి పర్యాయ పదం లేదన్నారు. జ్ఞాన భాండాగారాన్ని మనకు ప్రసాదించి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేవారే గురువులని పేర్కొన్నారు. మనలో అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞాన జ్యోతిని వెలిగించే అలాంటి వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తారని, ఆజన్మకు జీవించే కళ నేర్పేది మాత్రం గురువేనని చెప్పారు. అలాంటి వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు.

ఎక్కడ న్యాయం దొరకకపోతే..

సంఘం, సమాజంలో ప్రతి ఒక్కరికీ సమస్యలు వస్తుంటాయని, అక్కడ న్యాయం జరగని పక్షంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ అండగా నిలుస్తుందని చైర్‌పర్సన్ విజయభారతి స్పష్టంచేశారు. ఎక్కడ న్యాయం దొరకకపోతే.. హెచ్‌ఆర్‌సీని సంప్రదించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు హెచ్‌ఆర్‌సీ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సామాజిక రాజకీయ విశ్లేషకుడు, వక్త భాస్కరయోగి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముసురులో మురిపెంగా..



జలాశయంలో సరదాగా గడుపుతున్న యువత

ధారూరు: ఓ వైపు ఏకధాటిగా ముసురు ముసురుకున్నా.. ఏ మాత్రం లెక్కచేయకుండా కోట్‌పల్లి జలాశయ అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా బోటింగ్ చేయడానికి ప్రాధాన్యత చూపారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో విహరిస్తూ.. పరవశించిపోయారు.



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

వర్షం కురిసే.. రైతన్న మురిసే



పొలం పనుల్లో రైతులు, కూలీలు

పొలం బాట పట్టిన అన్నదాతలు

దుద్యాల్: ఐదు రోజులుగా కురుస్తున్న ఎకధాటి వర్షాలకు అన్నదాతల ఆనందానికి ఆవదుల్లేకుండా పోయింది. జూన్ మాసంలో కురిసిన అరకొర వర్షాలతో విత్తనాలు విత్తుకున్నారు. తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో విత్తనాలు మొలకెత్తక రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో జూలై మాసం ప్రారంభం నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండటం, విత్తులు మొల కెత్తడంతో రైతన్నలు పొల బాట పట్టారు. ముసురుతో పంటలకు పూర్తి స్థాయిలో నీరు అంది ఉండవచ్చని భావిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో సాగవుతున్న ఆరుతడి పంటల్లో కలపుతీత పనులతో పాటు, క్రిమి సంహారక, గడ్డి మందులను పిచికారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

ప్లాటినం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక

పరిగి: పట్టణ కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రధానాచార్యుడు మల్లేశ్‌ను 2024 ఏడాదికి గాను సెమ్స్ ఒలంపియాడ్ వారు ప్లాటినం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో పాఠశాల ఆచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల మల్లేశ్(25) శనివారం రాత్రి 8.30 గంటలకు మాల్ నుంచి తన బంధువును మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని కొత్తపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో తమ్మలోనిగూడ గేట్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లేశ్‌కు తీవ్ర గాయాలు కాగా.. మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు 'వరల్డ్ బుక్'లో చోటు



తల్లిదండ్రుల చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్

కొడంగల్ రూరల్: గురుపూజోత్సవంను పురస్కరించుకొని ఆన్‌లైన్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ ప్రిన్స్‌పాల్ డివి.నరేశ్‌రాజ్‌కు చోటు దక్కింది. మరో అంశం వర్తి వెల్నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వరత్న అవార్డును సైతం ప్రిన్స్‌పాల్ సొంతం చేసుకున్నారు. దీంతో అధ్యాపక బృందం ఆయనకు అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. 'ఉన్నతమైన చదువులు చదివి, మరింత ఉన్నతంగా పాఠాలు చెబుతున్న ప్రిన్స్‌పాల్' అని పేర్కొంటూ అవార్డులు, సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేసినట్లు వివరించారు. నెల రోజుల క్రితం ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపరచగా.. ఆదివారం రెండు అంశాల్లో కొరియర్ ద్వారా అవార్డులు వచ్చాయని ఆయన చెప్పారు. గురు పూజోత్సవం సందర్భంగా తల్లిదండ్రులే మొదటి గురువులుగా భావిస్తూ, ఆ అవార్డులను తల్లిదండ్రుల చేతులమీదుగా అందుకున్నానని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

కొందుర్గు: వీధి కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందగా.. మరో ఆవు గాయపడింది. ఈ సంఘటన ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులుకు చెందిన లేగదూడ, ఆవును వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఉండగా.. వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ ఘటనలో లేగదూడ మృత్యువాత పడగా.. ఆవు తీవ్రంగా గాయపడింది. దీంతో బాధిత యజమాని, గ్రామస్తులు మాట్లాడుతూ.. కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని, అధికారులు స్పందించి వాటి బారినుంచి పశుసంపదను, ప్రజలను కాపాడాలని కోరారు.

భక్తితోనే ముక్తి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బాబా సన్నిధిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, భక్తి పెంచుకోవడం వలన మనసు ప్రశాంతతంగా ఉండటంతో పాటు.. ఏకాగ్రత లభిస్తుందని సూచించారు.

సన్మార్గంలో నడిపించే వారందరూ గురువులే

భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని ఎమ్మెల్యే అన్నారు. సమున్నతమైన, గౌరవ ప్రదముతో కూడిన ఈ వృత్తి ఎంతో పవిత్రమైనదని, తల్లిదండ్రుల తర్వాతి స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. విద్యా వ్యవస్థలో వారి పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు జీవితాన్ని ఇస్తారని, గురువులను ప్రతి విద్యార్థి గౌరవించాలని, సన్మార్గంలో నడిపించే ప్రతి ఒక్కరూ గురువులేనని స్పష్టంచేశారు. మానవ జన్మను సార్థకం చేసుకునే జ్ఞానాన్ని అందించే వారు గురువులని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, శ్రీశైలంగౌడ్, సుధాకర్, తిరుపతిరెడ్డి, బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, మోహన్, శ్రీశైలం, సాయి, వంశీ, సీతారాం, భగవాన్‌దాస్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. పశువులు భద్రం

జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే

- పశు వైద్యాధికారి శ్రీప్రియ





పశువులకు గాలి కుంటు టీకాలు వేస్తున్న పశు వైద్యులు(ఫైల్)

నవాబుపేట: వానాకాలంలో మనుషులకే కాదు.. మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. ఈ సీజన్‌లో పశువులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. సూక్ష్మజీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు, వంటి వ్యాధులతో పాటు ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. వీటిని అధిగమించేందుకు రైతులు సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టాలని, పశువులకు వైద్య చికిత్స అందించాలని మండల పశువైద్యాధికారి శ్రీప్రియ సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి

గాలి కుంటు వ్యాధి సోకిన పశువు చాలా బలహీనంగా ఉంటాయి. పాలు ఇచ్చే పశువులు నీరసంగా ఉంటాయి. తద్వారా పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఎడ్లు సాగు పనుల్లో చురుగ్గా ఉండవు. సంకరజాతి పశువులతో పాటు షెడ్లలో పెంచుకునే వాటికి ఈ వ్యాధి వ్యాపిస్తుంది. దీనివలన వాటి నోటి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో అవి పగిలి పుండ్లుగా మారతాయి. ఈ కారణంగా అవి మేత, తీసుకోక నీరసించిపోతాయి.

జబ్బవాపు వ్యాధి

ఆరోగ్యవంతమైన, తెల్లజాతి పశువుల్లోనూ జబ్బవాపు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఇది సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతుంది. మేత మేయదు. జబ్బభాగం వాచి, నల్లగా కములుతుంది. అక్కడ కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి పశువు తీవ్రమైన నొప్పితో అల్లాడుతుంది. వాచిన చోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాంలో వైద్యం అందించకపోతే నీరసించి చనిపోతుంది. సకాలంలో గమనించి ఇంజక్షన్, గ్లూకోజ్ ద్రావణాన్ని ఇవ్వాలి. ముందస్తుగా టీకా వేసుకుంటే మేలు.

గొర్రెల్లో కాలిపుండ్లు

వర్షాకాలంలో గొర్రెలు బురదలో తిరగడం వలన కాలిపుండ్లు వ్యాధి సోకుతుంది. బురదలో తిరిగినప్పుడు గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లిపోతుంది. చీముపట్టి నొప్పితో ముందుకాళ్లపై గెంటుతాయి. వ్యాధి తీవ్రత పెరిగితే గిట్టలూడిపోతాయి. ఇది సోకిన పశువులకు 10 శాతం మైలతుత్తం, పదిశాతం జింక్ సల్ఫేట్, లేదంటే ఐదుశాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక ఆయిట్‌మెంట్ పూయాలి. యాంటి బయాటిక్ ఇంజక్షన్లు వరుసగా 3–5 రోజులు వేయించాలి. గొర్రెలను బురద నేలల్లో తిరగనియోద్దు.

గురక వ్యాధి..

ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు(గురక) ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న పశువుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అది సోకిన వాటికి అకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. మేత మేయదు. గొంతుపైన, మెడ కింద వాపు కన్పిస్తుంది. అది ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. వణుకుతుంది. కల్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే.. బాగా దగ్గుతూ, అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతుంది.

లేత గడ్డి ప్రమాదం

తొలకరి వర్షాలకు మొలిచే లేత గడ్డిని పశువులు అతిగా తింటుంటాయి. ఈ గ్రాసంలో హైడ్రో సైనెడ్ విష పదార్థం ఉంటుంది. ఇది మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయట పడతాయి. వెంటనే తగిన చికిత్స చేయించకపోతే ముత్యువాత పడే ప్రమాదం ఉంది. లేత గడ్డిని అధికంగా తిననివ్వవద్దు.

ఈగలు, దోమల దాడితో..

అపరిశుభ్రత ప్రదేశాలు, నీరు నిల్వ ఉన్న గుంతలు, మురుగునీటి కాలువల్లో ఈగలు, దోమలు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి ఆహారం కోసం పశువులను పట్టి పీడిస్తుంటాయి. వర్షాకాలంలో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. తద్వారా పశువులు మేత సరిగా మేయవు, నిద్ర సరిగా పోవు. ఫలితంగా అవి రక్తహీనతకు గురవుతాయి. వీటి కాటు వలన పశువు శరీరంపై పుండ్లు పుడతాయి. ఈగలు, దోమల నివారణకు పశువుల పాకలు, నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్‌ను పిచికారీ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండు పిడకలు, వేపాకుతో పొగపెడితే వాటి బెడద తగ్గుతుంది.

పెట్టుబడి భారం.. సాగుకు దూరం!

షాబాద్: కూరగాయల రైతుకు తిప్పలు తప్పడం లేదు. ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన) పథకం కింద ఈ ఏడు రాయితీపై విత్తనాలు, ట్రేలు, పందిళ్లు లభిస్తాయన్న ఆశ ఉండేది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. గడిచిన ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఆర్థికంగా నష్టాలు చవిచూశామని, ఈ సారైనా సబ్సిడీ లభిస్తే.. పెట్టుబడికి ఆసరాగా ఉంటుందన్న ఆశలు అడియాశలయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

15వేల ఎకరాల్లో సాగు

చేవెళ్ల నేలలు ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నాయి. వాతావరణం బాగానే ఉంటుంది. దీనివలన ఇక్కడ సాధారణ పంటలతో పాటు కూరగాయలను ఏటా విస్తారంగా పండిస్తారు. రెండు సీజన్లతో కలిపి దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు పలు రకాల కూరగాయలు సాగు చేస్తారు. షాబాద్, చేవెళ్ల మండలాల్లో వంకాయ, బెండ, పచ్చిమిర్చి, చిక్కుడు, కాలిఫ్లవర్, క్యాబేజీ, కీర, క్యారెట్, బీట్‌రూట్, శకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో బెండ, టమాట, బీర, సోరకాయ, కాకర, ఉల్లితో పాటు ఆకుకూరలు పండిస్తుంటారు. తమకున్న పొలంలో బోర్లు, బావుల కూరగాయలు సాగు చేస్తున్నారు.

అటకెక్కిన ఆర్‌కేవీవై..

ఉద్యాన పంటలను ప్రోత్సహించడంలో భాగంగా కూరగాయల రైతుకు ప్రయోజనం చేకూర్చేలా అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆర్‌కేవీవై పథకాన్ని తీసుకొచ్చాయి. ఈ స్కీం ద్వారా రాయితీపై కూరగాయలకు అవసరమయ్యే పందిళ్లకు 50 శాతం, విత్తనాలు, ట్రేలకు సబ్సిడీ ఇచ్చేవారు. దీంతో చాలా మంది రైతులు ఉద్యాన పంటలకు మొగ్గుచూపేవారు. పండించిన కూరగాయలను మార్కెట్‌కు తరలించడానికి వినియోగించే ట్రేలు, బీర, కాకర తదితర తీగజాతి కూరగాయలు పండించే రైతులు సబ్సిడీపై దొరికే పందిళ్లను వినియోగించేవారు. ఆర్‌కేవీవై పథకం 2015–16వరకు అమలు అయింది. ఆ తర్వాత స్వస్తి పలికారు. 2016–17 నుంచి రైతులు ఈ పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఏటా విత్తన ధరలు పెరిగిపోతున్నాయి. ఎకరా సాగు విత్తనాలకే రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వ్యయం అవుతోంది. సబ్సిడీ ఉన్నప్పుడు రూ.3వేల అయ్యేదని, ఇప్పుడు రెండింతలు అయిందని రైతులు తెలిపారు. సబ్సిడీపై విత్తనాలు, ట్రేలు, పందిళ్లు అందిస్తేనే ప్రయోజనం చేకూరుతుందని రైతులు అంటున్నారు.